క్లుప్తంగా

అర్హులకు న్యాయం చేయండి



మదనాపురం: రాజీవ్ యువ వికాసం పథకంలో నిజమైన అర్హులకు న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు వంగూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ ప్రసన్నకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు కొండ వెంకటేశ్వర్లు శెట్టి, అమర్నాథ్, శ్రీనివాసులు, కురుమన్న, బురాన్, కొండన్న, వడ్డె రాజు, చంద్రన్నగౌడ్, మొగులన్న, భరత్, రాము, భాస్కర్, రాములు, ఆంజనేయులు, వడ్డె బాబు, కృష్ణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



వీపనగండ్ల: ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వాటి బారిన పడకుండా తప్పించుకోవచ్చని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనదారులు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. యువకులు మొబైల్ ఫోన్లు, మత్తుకు దూరంగా ఉండి విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు.

‘ఉపాధి’ సమస్యలపై కలెక్టరేట్ ముట్టడి



అమరచింత: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలంటూ ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడిని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో బుధవారం ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు 8 వారాలుగా డబ్బులను చెల్లించడం లేదన్నారు. అనేక పోరాటాల వల్ల వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పనిని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శంకర్, బాలన్న, లింగమ్మ, తిరుపతిరెడ్డి, భాగ్యమ్మ, గోవిందమ్మ పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి



ఖిల్లాఘనపురం: ప్రతి ఒక్కరూ కొన్ని మొక్కలు నాటి, సంరక్షించాలని హార్ట్‌పుల్‌నెస్ మండల కోఆర్డినేటర్ దీర్ఘాయువు అన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆయుష్ విభాగం యోగా శిక్షకులు భాస్కరాచారి, భవితతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనందరికీ ఆరోగ్యానిచ్చే యోగాను ప్రతి రోజు చేయడం వలన ఎంతో మేలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మాధవి, ఆశాకార్యకర్తలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

‘ఖిల్లా’ విద్యార్థికి ప్రతిభా పురస్కారం

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన విద్యార్థి ఉదయ్‌కిరణ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కార ప్రశంసాపత్రంతో రూ.10వేల నగదు బహుమతి బుధవారం అందుకున్నాడు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ (ఎస్సీ గురుకులం, హైదరాబాద్)లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఉదయ్‌కిరణ్ 2024 లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో హైజంప్‌లో గోల్డ్‌మెడల్ సాధించడంతో పాటుగా 2024 అక్టోబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ హైజంప్‌లో సిల్వర్ పతకం సాధించాడు.

‘ధాన్యం కొంటాం ఆందోళన వద్దు’



శేరుపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్‌సురభి

వనపర్తి రూరల్: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తామని, ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఆదర్శ్‌సురభి రైతులకు భరోసా ఇచ్చారు. బుధవారం ఉదయం శ్రీరంగాపురం మండలంలోని శేరిపల్లిలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం 17 వరకు ఉన్నా.. వెంటనే తూకం వేసి గోదాంలకు తరలించాలని ఆదేశించారు. హమాలీల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. శేరిపల్లి గ్రామానికి 10 లారీలు కేటాయించామని, అవసరమైతే ఇంకొన్ని లారీలు అందుబాటులో ఉంచుతామని రైతులకు భరోసా ఇచ్చారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రానికి 15 రోజుల ముందుగా రావడం వల్ల రైతులు కొంత ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

అధికారులతో సమీక్ష

పెబ్బేరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఇందిరమ్మ ఇళ్లు, సీజనల్ వ్యాధులు, వనపర్తి రోడ్డు విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో మంజూరయిన ఇందిరమ్మ ఇళ్ల పునాది త్వరగా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వనపర్తి రోడ్డు విస్తరణలో తొలగించాల్సిన ఇంటి నిర్మాణ యజమానులకు నోటీసులు జారీ చేసి పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు మురళీగౌడ్, రాజు, ఎంపీడీఓ రవీందర్, కమిషనర్ అశోక్‌రెడ్డి, ఎంపీఓ రోజా తదితరులు పాల్గొన్నారు.

యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

వనపర్తి: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి రూ.లక్ష లోపు ఉన్న రుణానికిక దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు ఉత్తర్వులు జారీ చేస్తామని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. బుధవారం రాజీవ్ యువ వికాసం పథకం అమలు, విధివిధానాలపై హైదరాబాద్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో వారి సామర్థ్యంపై నమ్మకం పెట్టి రాజీవ్ యువ వికాసం ద్వారా దాదాపు రూ.650 కోట్లు సబ్సిడీ ద్వారా ఆర్థికసాయం అందిస్తున్నామన్నారు. దరఖాస్తులను నాలుగు కేటగిరీలుగా విభజించి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు దరఖాస్తు చేసుకున్న వాటిని జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు, రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు జూలైలో, రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఆగస్టులో, రూ.3 నుంచి 4 లక్షల వారికి సెప్టెంబర్‌లో మంజూరు పత్రాలు అందించి శిక్షణ ఇస్తామన్నారు.

28,110 దరఖాస్తులు

కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 134.93 కోట్లు సబ్సిడీ రూపంలో మంజూరు కాగా 28110 దరఖాస్తులు వచ్చాయన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు కలుపుకొని రూ.50 వేల యూనిట్ల కోసం 2,777 యూనిట్లు మంజూరు కాగా కేవలం 364 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపారు. రూ.లక్ష యూనిట్లు 2,045 మంజూరు కాగా కేవలం 796 దరఖాస్తులు, అత్యధికంగా రూ.4లక్షల యూనిట్లు మంజూరు కోసం 21,227 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, డీఆర్‌డీఓ పీడీ ఉమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మైనార్టీ కార్పొరేషన్ అధికారి అఫ్జలుద్దీన్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా ఎదగాలి



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ రమేష్‌రెడ్డి

వనపర్తి రూరల్: వేసవి శిక్షణ శిబిరాలను ఉపయోగించుకొని యువత నైపుణ్యం కలిగిన క్రీడాకారులుగా ఎదగాలని తహసీల్దార్ రమేష్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని కడకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన పర్యవేక్షించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఒలంపిక్స్ క్రీడల్లో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలని, ప్రభుత్వం అనేక క్రీడా పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఒలంపిక్స్‌లో పాల్గొనే దిశగా క్రీడాకారులు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నిరంజన్‌గౌడ్, ఆర్‌ఐ వెంకటేష్, నాయకులు గజ్జట గోవర్ధన్, హాకీ సీనియర్ క్రీడాకారులు తేజ, శరత్, బన్నీ, యువకులు పాల్గొన్నారు.

రైతులకు కర్షక్ మిత్ర రుణాలు



రైతులకు రుణం మంజూరు పత్రాన్ని అందిస్తున్న చైర్మన్ తదితరులు

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 13 మంది రైతులకు మండల సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు ఆధ్వర్యంలో బుధవారం కర్షక్‌మిత్ర రుణాలు కింద రూ.1.51కోట్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రైతులకు కర్షక్ మిత్ర రుణాలు అందించేందుకు గాను రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కో రైతుకు రూ.10 లక్షల చొప్పున ఈ రుణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న రైతు నుంచి భూమిని మాడ్‌గేజ్ చేసుకుని ఈ రుణాన్ని మంజూరు చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ రుణాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్లు సాయిచరణ్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాములునాయక్, కృష్ణయ్య, సింగిల్‌విండో కార్యదర్శి ప్రకాష్, సతీష్‌కుమార్, ఆగారం ప్రకాష్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హజ్రత్ ఖాద్రీ రహ్మతుల్లా దర్గా గంధోత్సవం

వనపర్తి రూరల్: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఉర్సుల్లో పెబ్బేరు మండలంలోని కొత్త సూగూరు గ్రామం ఒకటి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అతిపెద్ద ఉర్సు హజ్రత్ పకీర్ల షాఖాద్రీ రహ్మతుల్లా దర్గాలో గురువారం రాత్రి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే వేడుకలకు గ్రామ పంచాయతీ, దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. భక్తులు దర్గాను సందర్శించి, మొక్కులు ఉన్నవారు కోళ్లు, మేకలు, పొటేళ్ల బలిచ్చి కందూర్లు చేస్తారు. 29న పాత సూగూరు తాలిబ్ షా మౌలాఖాద్రీ దర్గాలో రాత్రి 7 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రత్యేక అలంకరణతో గంధోత్సవ ఊరేగింపు ప్రారంభం అవుతుంది. అర్ధరాత్రి రాత్రి 12 గంటలకు కొత్త సూగూరు దర్గాకు చేరుతుంది. 30న దర్గా ఆవరణలో రాత్రి 10 గంటలకు (దీపారాధన) ప్రముఖ గాయకులతో ఖవ్వాలీ నిర్వహిస్తారు. 31న ఉదయం 7 గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఖత్మే ఖురాన్, ఫాతేహాలతో ఉర్సు ముగుస్తుందని దర్గా 12వ పీఠాధిపతి సయ్యద్ సైపోద్దీన్ తెలిపారు.

మొరాయిస్తున్న ధాన్యం లారీలు



నిలిచిపోయిన ధాన్యం లోడ్ లారీని జేసీబీతో లాగుతున్న దృశ్యం

పాన్‌గల్: మండల కేంద్రంలోని గోదాంకు ధాన్యం తరలించే లారీలు మొరాయిస్తున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నిల్వల బస్తాలను గోదాం తరలించే లారీలు ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని రోడ్డు ఎత్తుగా ఉండటంతో ప్రతి నిత్యం ఇబ్బంది పడుతూనే ఉన్నాయి. బుధవారం ధాన్యం లోడ్ లారీ ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఒక పక్కకు పూర్తిగా ఒరిగి మొరాయించింది. దీంతో ధాన్యం లోడ్ లారీని జేసీబీ సహాయంతో ముందుకు లాగారు. దీంతో ప్రమాదం తప్పింది. గోదాంకు వెళ్లే దారి పూర్తి ఎత్తులో ఉండటంతో ప్రతి నిత్యం ధాన్యం లోడ్ లారీలు ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని లారీల కాంట్రాక్టర్ పేర్కొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవానికి ఏర్పాట్లు



ఆత్మకూర్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్ల ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ముమ్మరంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు నిర్వాహకులు ఆహ్వాన పత్రిక అందజేసారు. జూన్ 3 నుంచి 5 వరకు నూతన ఆలయాల ప్రారంభోత్సవాలు, గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలు ప్రముఖ వేదపండితుల మంత్రోచ్చరణలతో జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రూ.లక్ష విరాళం అందించిన రహ్మతుల్లా

ఆత్మకూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాల నిర్మాణాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండీ రహ్మతుల్లా రూ.లక్ష నగదును నిర్వాహకులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, నిర్వాహకులు అశ్విన్‌కుమార్, జిందె శ్రీనివాస్, ఆనంద్, కొండాపురం రాము, మణివర్ధన్‌రెడ్డి, ఎస్టీడీ శ్రీను, శివానంద్, రమాకాంత్, నాగేష్, వెంకటేష్, యాదగిరిశెట్టి, బాలకృష్ణ, రఘు, సూరి, అశోక్, కృష్ణయ్య, రవీందర్, రాము, సాయిరాఘవ పాల్గొన్నారు.

ఎన్టీ రామారావు సేవలు మరువలేం

సాక్షి, నెట్‌వర్క్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ప్రజలకు చేసిన మేలును ప్రజలు ఎన్నటికీ మరచిపోరని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌అధ్యక్షుడు రాములు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని గోపాల్‌పేట, వీపనగండ్ల మండలంలోని కల్వరాలలో, ఆత్మకూర్ పట్టణంలోని ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజు, ఆవుల శ్రీనివాసులు, కాగితాల లక్ష్మయ్య, ఏర్పుల చిన్నయ్య, కల్వరి వెంకటేశ్వర్లు, బుచ్చారెడ్డి, తెలుగు శ్రీను, కృష్ణయ్య, విష్ణు, బాలవెంకటయ్య, దివాన్జీ అశోక్‌రావు, కట్టెలమండి రాములు, ఎస్టీడీ శ్రీనివాసులు, తిరుపతయ్యగౌడ్, రవికుమార్, వెంకటన్న, జగన్, కుర్మన్న, చంద్రన్న, గాలిపంపు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు క్రీడాకారుల ఎంపిక

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి 11వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ శిక్షకుడు యం.అజయ్‌కుమార్ తెలిపారు. అండర్-8 బాలికల పరుగు పందెం విభాగంలో వి.జోష్నవి 200 మీటర్లు మొదటి స్థానంలో నిలవగా, 60 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానంలో నిలిచింది. అండర్-10 బాలికల పరుగు పందెంలో వి.లేఖన 300 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచింది. అండర్-12 బాలికల లాంగ్ జంప్, షార్ట్‌పుట్ విభాగంలో ఎం.లోకేశ్వరి షార్ట్‌పుట్‌లో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచింది. జె.వేదశ్రీ లాంగ్ జంప్‌లో మొదటి స్థానం, షార్ట్‌పుట్‌లో రెండో స్థానంలో నిలిచింది. అండర్-12 బాలుర విభాగంలో చరణ్ షార్ట్‌పుట్‌లో రెండో స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలవడంపై మాజీ సర్పంచ్ హిమబిందుతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

‘ఖిల్లా’ విద్యార్థుల సత్తా

ఖిల్లాఘనపురం: రాష్ట్రస్థాయి 11వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు మండలం నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని పీఈటీ దేవేందర్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికల్లో మండలం నుంచి పాల్గొన్న క్రీడాకారులు పదేళ్ల లోపు వారిలో జంగం సాయి సాత్విక్ 300 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానంలో, ఆర్.మహేష్ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం, 300 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, 12 ఏళ్ల వయసు వారిలో జంగం సాయిరిత్విక్ 300 మీటర్లు, 60 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, కె.సింధు 600 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆయన చెప్పారు. వీరు జూన్ 1న సికింద్రాబాద్‌లోని జింఖానాగ్రౌండ్‌లో నిర్వహించే 11వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరుపున పాల్గొంటారన్నారు.

తెలంగాణ సాహితీ సౌరభం ‘సురవరం’



జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు



కొత్తకోటలో..

వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ ప్రజల గొంతుకై నినదించిన తెలంగాణ సాహితీ సౌరభం సురవరం ప్రతాపరెడ్డి అని సురవరం ప్రతాపరెడ్డి వనపర్తి ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు కొనియాడారు. సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బొలెమోని రమేష్, కొండన్న యాదవ్, పికిలి రాము, యాదిరెడ్డి, మహమ్మద్ ఖలీల్, గంధం దినేష్, కుమార్, శేఖర్‌యాదవ్, పురుషోత్తం, గోపాలకృష్ణ, తరుణ్ తదితరులు ఉన్నారు.

కొత్తకోట: పాలమూరు ముద్దు బిడ్డ, తొలి శాసన సభ్యుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతి వేడుకలను స్థానిక చౌరస్తాలో బుధవారం కొత్తకోట రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి హాజరై సురవరం ప్రతాప్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, బాబురెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, జగన్, శాంతిరెడ్డి, బాలకృష్ణ, రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించొద్దు



ఖిల్లాఘనపురంలో తనిఖీలు చేస్తున్న ఏఓ మల్లయ్య, ఎస్‌ఐ సురేష్

సాక్షి, నెట్‌వర్క్: ఫర్టిలైజర్ షాపు యజమానులు, డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దని వ్యవసాయ అధికారులు ఆదేశించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు స్టాక్ రికార్డులు, ఎరువుల గడువు తేదీ, లైసెన్స్, విత్తనాల నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు.

- కొత్తకోట మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను టాస్క్ ఫోర్స్ బృందం, మండల వ్యవసాయ అధికారిణి జాస్మిన్, ఏఎస్‌ఐ రామకృష్ణతో కలిసి తనిఖీలు నిర్వహించారు. నకిలీ విత్తనాల అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
- వనపర్తి మండలంలోని పెద్దగూడెం, నాచహళ్లి, చందాపూర్ గ్రామాల్లో వనపర్తి రూరల్ ఎస్‌ఐ బాలయ్య, వ్యవసాయ అధికారి కురుమయ్యతో కలిసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.
- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని రాఘవేంద్ర, ప్రవంతి, ఎస్‌వీ నర్సింహులు తదితర ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల విత్తన టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- మదనాపురం మండల కేంద్రంలో బుధవారం మండల సీడ్ టాస్క్ ఫోర్స్ బృందం అన్ని వ్యవసాయ ఇన్‌పుట్ డీలర్ల వద్ద తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ (ప్రొబేషన్) గోపాలకృష్ణ, వ్యవసాయ అధికారి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.
- అమరచింత మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఏఓ అరవింద్, ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.
- ఆత్మకూర్ పట్టణంలోని విత్తన, ఫర్టిలైజర్స్ షాపుల్లో ఎస్‌ఐ నరేందర్, ఏఓ వినయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. విత్తనాల నిల్వలు, గడువు తేదీ, లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు.



మదనాపురంలో..



చందాపూర్‌లో..



కొత్తకోటలో..

మహిళల రక్షణకే సఖి కేంద్రాలు



మాట్లాడుతున్న కవిత

వనపర్తి విద్యావిభాగం: సమాజంలో పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్న మహిళలు సఖి కేంద్రాలను సద్వినియోగం చేసుకొని, ఉపశమనం పొందాలని సఖి కేంద్రం కార్య నిర్వాహకురాలు కవిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణ శిబిరంలో మహిళా చట్టాలు, సఖి సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రాల్లో మహిళలకు సంబంధించిన పలు సమస్యలపై కౌన్సిలింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. సఖి కేంద్రాల్లో తాత్కాలిక వసతి, వైద్య సేవలు, కౌన్సిలింగ్, రక్షణ, న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న వివక్ష రూపుమాపాలని కోరారు. మహిళలు వేధింపులకు గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 181ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాసులు, నేషనల్ గ్రీన్ కోర్ కమిటీ జిల్లా కోఆర్డినేటర్ ఐ.సుదర్శన్, సుదర్శన్‌రావు, రిసోర్స్‌పర్సన్ మల్లేష్‌కుమార్, సఖి కేంద్రం లీగల్ కౌన్సిలర్ డి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధంకండి

ఆత్మకూర్: ముందస్తుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భ జల మట్టం పెరుగుతుందని వన మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీపాద్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఏపీఓ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి సంరక్షించేందుకు ప్రజలను భాగస్వాములను చేయాలని ఆదేశించారు. ఇంటింటికీ ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు, భూగర్భ జలాలు పెంపొందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు.

రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

మదనాపురం: వికసిత్ సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 29వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు కేవీకే, మదనాపురం ఆధ్వర్యంలో భారతీయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, జిల్లా వ్యవసాయ అధికారులు రైతుల వద్దకు వెళ్లి ప్రస్తుత వర్షాకాలంలో సాగు చేసే పంటలపై సూచనలు ఇస్తారని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సుమారు 45 గ్రామాలను 15 రోజుల్లో పర్యటించి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

అమరచింత: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరు బాధితుల ఫిర్యాదు మేరకు వాటిని స్వాధీనం చేసుకొని వారికి తిరిగి అప్పగించినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. కొన్ని రోజుల కిందట పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ సెల్ ఫోన్లు పోగొట్టుకున్నామని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.